క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలోని వైఎస్సార్‌ సీపీ నాయకుడు తాతా రాంబాబు ఇంటి వద్ద వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కైలే అనిల్‌కుమార్‌ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కౌలు రైతులు ప్రీమియం చెల్లించవచ్చు

ముదినేపల్లి రూరల్‌: గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులు పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించొచ్చని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్‌ తెలిపారు. ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.840 చొప్పున స్థానిక రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే రైతులు, కౌలు రైతులకు సంబంధించి రుణం పొందే సమయంలోనే బ్యాంకర్లు ప్రీమియం చెల్లిస్తారని తెలిపారు. రుణాలు పొందని రైతులు విడిగా ప్రీమియం చెల్లించుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రీమియం చెల్లించేందుకు వచ్చే నెల 15 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో చేస్తున్నది ఐదు పరీక్షలు మాత్రమే..

మండవల్లి: మండవల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 63 రకాల పరీక్షలకు సంబంధించిన పరికరాలు ఉన్నా, ల్యాబ్‌ టెక్నీషియన్‌ లేకపోవడంతో 4, 5 రకాల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్‌ భాస్కరరావు, జిల్లా కన్వీనర్‌ టి.అప్పారావు, ఉపాధ్యక్షుడు జె శ్రీనివాసరావు, వై శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు పీజీఆర్‌ఎస్‌లో సోమవారం తహసీల్దార్‌ కె.గోపాల్‌కు అర్జీ అందజేశారు. మండలంలో 35 వేల మంది జనాభా ఉన్నప్పటికీ, 22 రోజుల క్రితం ల్యాబ్‌ టెక్నీషియన్‌ బదిలీపై వెళ్లడంతో పోస్టు ఖాళీగా ఉండి రక్త పరీక్షలు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ హారికకు లుక్కా పరామర్శ



తోట్లవల్లూరు: జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారికను బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. గుడివాడలో ఇటీవల టీడీపీ అల్లరిమూకలు హారిక దంపతులపై దాడి చేసిన నేపథ్యంలో పెడన సమీపంలోని స్వగృహంలో ఆమెను కలిసి పరామర్శించటంతోపాటు సంఘీభావం తెలిపినట్లు లుక్కా తెలియజేశారు. బీసీ వర్గానికి చెందిన మహిళను దూషించటం, దాడికి పాల్పడటం నీచమైన చర్యని, ఇలాంటి చర్యలకు పాల్పడే వాళ్లు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

వంగిన విద్యుత్‌ స్తంభంతో ఇక్కట్లు



మండవల్లి: మండవల్లి వెలమపేట రామాలయం వద్ద విద్యుత్‌ పోల్‌ కిందకు వంగడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పరిసరాల్లో ఉన్న గృహాలకు చెందిన పిల్లలు ఆడుకోవడానికి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు పోల్‌ కిందకు వంగడంతో వైర్లు జారిపడే ప్రమాదముందని గంగునేని శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్గాభవాని సేవలు ప్రశంసనీయం



పమిడిముక్కల: షైనింగ్‌ టీచర్‌ యలమంచిలి దుర్గాభవాని సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ-2 శ్రీనివాస్‌ అన్నారు. షైనింగ్‌ టీచర్‌గా ఎంపికై విద్యాశాఖమంత్రి లోకేష్‌ చేతుల మీదుగా సత్కారం అందుకున్న పమిడిముక్కల హెచ్‌ఎం యలమంచిలి దుర్గాభవానిని సోమవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. పెనమలూరు హైస్కూల్లో పనిచేసిన దుర్గాభవాని ఆ పాఠశాల అభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశారని శ్రీనివాస్‌ తెలిపారు.



పెదపారుపూడిలోని పాలకోడు డ్రెయిన్‌లో పైకి తేలిన గుర్రపుడెక్క



పూడుకుపోయిన చంద్రయ్య డ్రెయిన్‌



గురజాడ పరిధిలో ముంపునకు గురైన పొలాలు

నీట మునిగిన వరి పొలాలు

- చెరువులను తలపిస్తున్న పొలాలు
- పాలకోడు డ్రెయిన్‌ కింద 100 ఎకరాల మునక
- డ్రెయినేజీ అధికారి నిర్లక్ష్యమే అంటున్న రైతులు



పెదపారుపూడి డంపింగ్‌ యార్డు సమీపంలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

పెదపారుపూడి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలకోడు డ్రెయిన్‌ కింద ఉన్న సమారు 100 ఎకరాల వరి పైరు నీట మునిగింది. వీటికి సంబంధించిన పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెదపారుపూడి గ్రామంలో ఉన్న పాలకోడు డ్రెయిన్‌కు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీరు పంట పొలాలను ముంచెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేసిన కొద్ది రోజులకే పొలాలు నీట మునిగిపోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..

పాలకోడు డ్రెయిన్‌లో దట్టంగా గుర్రపుడెక్క పేరుకుపోయిందని డ్రెయినేజీ ఏఈ అనిల్‌కు పెదపారుపూడి గ్రామానికి చెందిన జాజుల శ్రీనివాసరావు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మండల అధికారులకు కూడా గుర్రపుడెక్క తొలగించాలని విన్నవించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఎట్టి పరిస్థితిల్లో వరి నాట్లు సమయానికి గుర్రపుడెక్క తొలగిస్తామని అధికారులు చెబితే మీకోసం అర్జీపై సంతకం పెట్టి వెనక్కు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఊహించన విధంగానే గుర్రపుడెక్క దట్టంగా ఉండటంతో పై నుంచి వచ్చే వరద నీరు ఎగదన్ని పంట పొలాలు మునిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. డ్రెయినేజీ ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారేగాని సమస్య పరిష్కరించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నీట మునిగి దెబ్బతిన్న వరి పంట పొలాలకు ఎవరు నష్ట పరిహారం అందిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పూడుకుపోయిన చంద్రయ్య డ్రెయిన్‌

పమిడిముక్కల: గురజాడ పరిధిలోని చంద్రయ్య డ్రెయిన్‌ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో మూసుకుపోయింది. ఈ డ్రెయిన్‌ ఎనినపాడు నుంచి ఉయ్యూరు వైపు వెళ్లి రైవస్‌ కాలువ కింద తూముల గుండా గుడివాడ వైపు వెళుతుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురజాడ, ఉయ్యూరు పరిధిలోని పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. 500 ఎకరాల పైన నాట్లు వేసిన పొలాలు ముంపులోనే ఉన్నాయి. పొలాల్లోని ముంపు చంద్రయ్య డ్రెయిన్‌లోకి వెళ్లాల్సి ఉంది. డ్రెయిన్‌ పూర్తిగా పూడిపోయి ఉండటంతో మురుగునీరు పోయేందుకు అవకాశం లేక పొలాలు ముంపుబారిన పడ్డాయి. వెంటనే డ్రెయిన్‌లో పూడికతీసి మురుగునీరు పోయే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గుర్రపుడెక్క వలనే పొలాలు మునక



పాలకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించి ఉంటే వరి పొలాలకు ముప్పు ఉండేది కాదు. 100 ఎకరాల వరకు నీట మునిగింది. గత ఏడాది కూడా ముంపు వలన పంట దెబ్బతిన్నది. మళ్లీ ఇప్పుడు అదే జరిగింది. కేవలం డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం వలనే రైతులకు ఈ పరిస్థితి వచ్చింది.

– నీలపాల శ్రీనివాసరావు, పెదపారుపూడి

వైఎస్సార్‌ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



అనుబంధ పదవులు చేపట్టిన నాయకులను అభినందిస్తున్న డీఎన్నార్‌

కైకలూరు: వైఎస్సార్‌ సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) పేర్కొన్నారు. ఇటీవల పార్టీ జిల్లా అనుబంధ కమిటీల నియామకాల్లో కైకలూరు నియోజకవర్గంలో వందకు పైబడి కార్యకర్తలు, నాయకులకు పదవులు వరించాయి. ఈ సందర్భంగా కలిదిండి మండలంలో జిల్లా కమిటీల్లో పదవులు దక్కిన నాయకులు కైకలూరు పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌కు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. కలిదిండి మండల వైఎస్సార్‌ సీపీ ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నాయకులను ఉద్దేశించి డీఎన్నార్‌ మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు వరిస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

సోషల్‌ మీడియా ప్రకటనలతో మోసపోవద్దు



బాలికల ఉన్నత పాఠశాల్లో అవగాహన కల్పిస్తున్న టౌన్‌ సీఐ కృష్ణ

కైకలూరు: సోషల్‌ మీడియాలో ఉద్యోగాల ప్రకటనలకు ఆకర్షితులై యువతీ, యువకులు డబ్బు చెల్లించి మోసపోతున్నారని కైకలూరు టౌన్‌ సీఐ పి.కృష్ణ అన్నారు. ఆటపాక మాగంటి లక్ష్మీబాయి, పుల్లేశ్వరరావు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌, ఆన్‌లైన్‌ మోసాలు, సైబర్‌ నేరాలపై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఫేస్‌ బుక్‌ వేధింపు బాధితులు ఇటీవల ఎక్కువవుతున్నారన్నారు. యువతీ యువకుల మధ్య స్నేహం చెడిన తరువాత గతంలో దిగిన ఫొటోలు యువతులకు శాపంగా మారుతున్నాయన్నారు. స్నేహంలో ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలను వరుడికి పంపించి వివాహాన్ని నిలుపుదల చేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌, వాట్సాప్‌ సోషల్‌ నెట్‌వర్క్‌లు, జీమెయిల్‌ను అవసరం మేరకు మాత్రమే వాడాలన్నారు. ఫొటోలు, వ్యక్తిగత సమాచారం, అసభ్యకర పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. టౌన్‌ ఎస్‌ఐ ఆర్‌.శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఎవరు ఫోన్‌ చేసినా ఓటీపీ, పిన్‌ నంబర్లు చెప్పొద్దన్నారు. బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు పి.శైలజా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


అస్తవ్యస్తంగా నందిగామలంక–పెనుమాకలంక రోడ్డు



బురదమయంగా మారిన నందిగామలంక-పెనుమాకలంక రహదారి

మండవల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు కొల్లేటి గ్రామాలైన నందిగామలంక, పెనుమాకలంక రహదార్లు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్డుపై వర్షం నీరు నిలిచి బురదమయంగా మారాయి. ఈ రహదారిపై రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండవల్లి నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరు వెళ్లి తమకు ఏమైనా సమస్యలు వస్తే చెప్పుకోవడానికి ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిపై అత్యవసరంగా డాక్టర్ల వద్దకు, ఆస్పత్రులకు వెళ్లాలంటే వృద్ధులు, మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులను అభివృద్ధి చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామన్న కూటమి నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నేడు వైఎస్సార్‌ సీపీ విస్తృత స్థాయి సమావేశం



దూలం నాగేశ్వరరావు

కైకలూరు: వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం కైకలూరు తాలూకా సెంటర్‌ సీతారామ ఫంక్షన్‌ హాల్లో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) తెలిపారు. సోమవారం వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రీకాలింగ్‌ చంద్ర బాబూస్‌ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి పార్టీ రీజినల్‌ కో–ఆర్డినేటర్‌, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్‌ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌ యాదవ్‌, పార్లమెంట్‌ పరిశీలకులు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌, ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్‌, ఏలూరు, నూజివీడు, ఉంగుటూరు, పోలవరం, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల సమన్వయకర్తలు మామిళ్లపల్లి జయప్రకాష్‌ (జేపీ), మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, కొఠారు అబ్బయ్య చౌదరి, కంభం విజయరాజు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు సభను విజయవంతం చేయాలని డీఎన్నార్‌ కోరారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌ రద్దు చేయాలని అంగన్‌వాడీల ధర్నా



మొవ్వ సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మొవ్వ: అంగన్‌వాడీ సేవలు పొందటానికి ముఖ గుర్తింపు విధానాన్ని (ఎఫ్‌ఆర్‌ఎస్‌) రద్దు చేయాలని స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సులోపు పిల్లల తల్లులకు సంబంధించి ఫోన్‌ ద్వారా ముఖ గుర్తింపు చేపట్టే విధానాన్ని రద్దు చేయాలన్నారు. తమకు నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు ఎస్‌ విజయలక్ష్మి, అధ్యక్షురాలు దగాని రాజారత్నం, కార్యదర్శి తాతాశివకుమారి, కోశాధికారి సీహెచ్‌ సునీత, సీఐటీయూ జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ ఎండీ కరీముల్లా, సీహెచ్‌ గంగా భవాని, నెరుసు గోపి తదితరుల నాయకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరావు తమ మద్దతు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

భారీ వర్షం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో సోమవారం భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అంతర్గత రహదారులు, పల్లపు రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. వర్షాలతో మాగాణి పొలాలు నీటి తటాకాల్లా దర్శనమిస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు సాగునీటి కొరతతో అల్లాడిన రైతులకు వర్షాలు బాగా ఊరటనిచ్చాయని చెప్పొచ్చు. ఎండల తీవ్రత, సాగునీటి కొరతతో మందకొడిగా సాగుతున్న వరినాట్లకు వర్షాలు బాగా ఉపకరించాయని రైతులు అంటున్నారు. నీటి కొరత తీరటంతో రైతులు వరినాట్లను వేగవంతం చేశారు. వర్షాలు ఇలాగే మరికొన్ని రోజులు కురిస్తే పల్లపు ప్రాంతాల్లోని వరినాట్లు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని రైతులు అంటున్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు

గుడివాడ టౌన్‌: గుడివాడ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌. మనోహర్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమిషనర్‌ పి. శ్రీనివాసరావు, మున్సిపల్‌ ఇంజినీర్‌ ప్రసాద్‌, అకౌంట్స్‌ ఆఫీసర్‌ జి.టి. నాయుడు, ఏసీపీ వి. ఏసుబాబు పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

కైకలూరు: గ్రామంలో నడిచే రోడ్డుపై ఇసుక దిగుమతి చేసిన క్రమంలో ఏర్పడిన ఘర్షణలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన భుజబలపట్నం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన జంగం ఏలియా రోడ్డుపై అడ్డుగా ఉన్న ఇసుక గురించి ప్రశ్నించాడు. దీంతో బంధువులైన నదర్ల ఏసయ్య, అతడి కుమారుడు బన్ను కలిసి ఏలియాపై కత్తులకు సాన పెట్టే ఆకురాయితో తలపై దాడి చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్‌ ఎస్‌ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

ముదినేపల్లి రూరల్‌: మండలంలోని చిగురుకోట, పెదగొన్నూరు సొసైటీల త్రిసభ్య కమిటీల సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. చిగురుకోట సొసైటీ అధ్యక్షుడిగా చలసాని జగన్‌మోహనరావు, సభ్యులుగా భట్రాజు శ్యామలరాజు, పరిశే వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కొడాలి వినోద్‌ పాల్గొన్నారు. పెదగొన్నూరు సొసైటీ అధ్యక్షుడిగా గునుపుడి నాగరాజు, సభ్యులుగా కాకర్ల శ్యామసుందర్‌, వీరమల్లు సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి గాయాలు

కైకలూరు: సైకిల్‌పై వెళుతున్న బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలైన ఘటన కైకలూరు ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఆటపాక శివారు జాన్‌పేటకు చెందిన ఎర్రగుంట మహేంద్ర గ్రామంలో 7వ తరగతి వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. సైకిల్‌పై కైకలూరు రైల్వేస్టేషన్‌కు వెళుతుండగా ఏలూరు నుంచి భీమవరం వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. మహేంద్రకు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి, ఏలూరుకు తరలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలదుర్గా మాతకు సారె సమర్పణ



జగన్నాథ స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళలు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో పార్వతీదేవి ప్రతిరూపమైన జలదుర్గా మాతకు ఆషాఢ సారెను మహిళలు సోమవారం సమర్పించారు. కొల్లేటికోట, లక్ష్మీపురం, ఏలూరు నుంచి అధిక సంఖ్యలో మహిళలు విచ్చేసి సారెను అందించి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసిన రవిక, కంకుమ, గాజులను మహిళలకు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్‌ మహిళా భక్తులకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వర శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

జగన్నాథుడికి..

ముదినేపల్లి రూరల్‌: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీసుభద్రబలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో అనేక మంది భక్తులు సోమవారం ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత గ్రామంలోని సెంటర్‌ నుంచి అనేక మంది భక్తులు స్వీట్లు, పూలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యుల చేతుల మీదుగా సారెను సమర్పించారు. అనంతరం భక్తులకు ఆషాఢ సారె ప్రాముఖ్యత గురించి ప్రధాన అర్చకుడు వివరించారు. అనేకమంది భక్తులు పూలు, పండ్లుతో స్వామికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఏటా ఇదే మాసంలో సారె సంప్రదాయాన్ని కొనసాగిస్తామని పలువురు భక్తులు తెలిపారు.



జగన్నాథస్వామికి సారెను సమర్పిస్తున్న భక్తులు



జలదుర్గామాతకు ఆషాఢ సారె సమర్పణ



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద కోలాట ప్రదర్శన

యోగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



పమిడిముక్కల: జిల్లా స్థాయి యోగా పోటీల్లో తాడంకి హైస్కూల్‌ విద్యార్థిని ప్రతిభ చాటారు. ఇటీవల గండిగుంట దత్తసాయి కల్యాణ మండపంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తాడంకి హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థిని బోయి కృష్ణవేణి ద్వితీయ స్థానం సాధించారు. యోగాసన స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ అవనిగడ్డ వారు కృష్ణవేణికి సిల్వర్‌ మెడల్‌ బహూకరించారు. హైస్కూల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను, సిల్వర్‌ మెడల్‌ సాధించిన విద్యార్థిని కృష్ణవేణిని హెచ్‌ఎం ప్రసాద్‌, పీడీ రవీంద్రబాబు అభినందించారు.

25న చెస్‌, షటిల్‌ పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న స్టేడియం కమిటీ సభ్యులు

గుడివాడ టౌన్‌: ఎన్టీఆర్‌ స్టేడియం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ చెస్‌, షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు నిర్వహించనున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్‌ తెలిపారు. సోమవారం స్థానిక స్టేడియం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్టేడియం సంవత్సరిక క్రీడల్లో భాగంగా కఠారి శ్రీనివాసరావు మెమోరియల్‌ ఆల్‌ స్కూల్స్‌ చెస్‌, షటిల్‌ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్‌-9, అండర్‌-11, అండర్‌-13, అండర్‌-15 విభాగాలలో విడివిడిగా పోటీలుంటాయని పేర్కొన్నారు. షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో అండర్‌-13, అండర్‌-15 సింగిల్స్‌, డబుల్‌ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు సింగిల్‌ పోటీకి రూ. 300, డబుల్‌కు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. క్రీడాకారులు తమ సొంత బ్యాట్‌లు తెచ్చుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్టేడియం కార్యాలయంలో క్రీడాకారులు తమ పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. 25వ తేదీ ఉదయం 9 గంటలకు క్రీడాకారులు స్టేడియం చేరుకోవాలని 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 81797 51717(చెస్‌), 89194 77065(షటిల్‌ బ్యాడ్మింటన్‌)లకు సంప్రదించాలని పేర్కొన్నారు. షటిల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో విజేతలకు సింగిల్‌ రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. 1 వెయ్యి, డబుల్స్‌ రూ. 5 వేలు, రూ. 3. వేలు, రూ. 2 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ గ్రీవెన్స్‌ ఫోరం

గుడివాడ టౌన్‌: విద్యుత్‌ వినియోగదారుల సమస్యలు పరిష్కారం, ఇతర అంశాలకు సంబంధించి విద్యుత్‌ కన్స్యూమర్‌ గ్రీవెన్స్‌ ఫోరం ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్‌ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు హనుమాన్‌ జంక్షన్‌లోని ఎస్‌ఆర్‌ కన్వెన్షన్‌ హాలు(రాయల్‌ హంపి)లో ఈ ఫోరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ విక్టర్‌ ఇమ్మానుయేల్‌, ఫోరం సభ్యులు, సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ మచిలీపట్నం, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌ పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను ఈ ఫోరంలో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మోటార్‌ ప్యానల్‌ బాక్స్‌ల చోరీపై ఫిర్యాదు

మొవ్వ: మొవ్వ పాలెం పొలాల్లోని మోటారు షెడ్డులో ప్యానల్‌ బాక్స్‌ల (స్టార్టర్‌ బాక్స్‌, ఫీజు బాక్స్‌) చోరీ ఘటనపై సోమవారం కూచిపూడి పోలీస్‌ స్టేషన్లో రైతులు ఫిర్యాదు చేశారు. మొవ్వ పాలెం గ్రామానికి చెందిన రాఘవేంద్రరావు ఆదివారం రాత్రి తమ పొలంలో మోటార్‌ షెడ్డులో చోరీ యత్నం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టినట్లు కూచిపూడి ఎస్‌ఐ కేఎన్‌ విశ్వనాథ్‌ తెలిపారు.